# దువ్వెన నవ్వింది

ఆరో నెల మూడో ఆదివారం, ఉదయం ఎనిమిది గంటల ఇరవై అయిదు నిమిషాలయింది. ఒకసారి కాఫీ తాగటం పూర్తయింది. దినపత్రికలో వారఫలాలు చూడటంతోసహా పేపరు మొత్తం చదవటం పూర్తయింది. కరెంట్ కోత లేకపోతే దూరదర్శన్‌లో ఏదో కార్యక్రమం కాలక్షేపం అయ్యేది. మరో కాలక్షేపం లేక ఇంకో కాఫీ ఇవ్వమని అడిగాను శ్రీమతిని.

"గుడ్ మార్నింగ్ సార్" అన్నమాట వినబడి గేటువంక చూశాను.

చిరునవ్వుతో, చేతిలో లెదర్‌బ్యాగ్‌తో పాతిక సంవత్సరాల యువకుడు. నున్నగా షేవ్ చేసుకున్న గెడ్డం, పెద్దగా పెంచుకున్న మీసం లోపలికి వచ్చాడు. ఎదురుగా ఉన్న కుర్చీ చూపించాను.

ఎవరో వచ్చారని గ్రహించిన శ్రీమతి రెండు కప్పుల్తో కాఫీ పంపింది మా చిన్నపాపచేత.

"ఇది మోడరన్‌గా తయారు చేసిందండీ. నోసైడ్ ఎఫెక్ట్స్. చాలా బాగా పనిచేస్తుంది. పైగా ఖరీదు చాలా రీజనబుల్ కూడా. పీస్‌కి ఓ స్కెచ్ పెన్, ఓ బాల్‌పెన్ ఉచితం. కంపెనీనుంచి డైరెక్ట్‌గా మా ప్రొడక్ట్ ప్రమోట్ చేయటానికి వచ్చాం కాబట్టి ఎనభైరూపాలయకే ఇస్తున్నాం. మార్కెట్లో కొనాలంటే నూట పదిరూపాయలు. పైగా గిఫ్ట్ వుండదు" చెప్పేడతను.

అతను విషయాలు చెప్తూనే అందమైన ఓ పాకెట్ నా చేతిలో పెట్టాడు. అప్పటికే మా పెద్దమ్మాయి, చంటోడు రంగప్రవేశం చేశారు.

ఆకర్షణీయంగా కనిపిస్తున్న పాకెట్ అందుకుని అన్నివైపులా పరిశీలించి చూశారు.

"తీస్కోండి డాడీ" పాకెట్ మీది బొమ్మ చూసి ముచ్చటపడ్డారు ఆడపిల్లలిద్దరు.

వాళ్ళ చేతుల్లోంచి పాకెట్ అందుకుని లోపలికి నడిచాను. విషయం వివరంగా చెప్పేను శ్రీమతికి.

"తీస్కోండి పోనీ. దోమల్తో చస్తున్నాం. షాపుల్లో అయితే నూట పది అంటున్నాడన్నారుగా. ఇప్పుడయితే ఎనభయ్యా.. అరవైకి ఇస్తాడేమో కనుక్కోండి" రహస్యంగా అన్నదామె.

వరండాలోకి వచ్చిబేరం ప్రారంభించగానే

"అలా రేటుతేడా వుండదు సార్. కంపెనీవాళ్ళు ఫిక్స్ చేసిన ధరే. మేముగా రేటు విషయంలో ఏం తగ్గించలేం" అంటూ స్కెచ్‌పెన్, బాల్‌పెన్ బయటకు తీశాడు. ఆ రెంటిని చూడగానే మా పిల్లల ఉత్సాహం రెట్టింపయింది. శ్రీమతి కూడా సుముఖంగా వుండటంతో ఎనభై రూపాయలకు దోమల్ని చంపే విద్యుత్ పరికరాన్ని కొనేశాను.

కృతజ్ఞతలు తెలియజేసి, బ్యాగ్ సర్దుకుని వెళ్ళిపోయాడతగాడు.

స్కెచ్‌పెన్ పెద్దమ్మాయి, బాల్‌పెన్ చిన్నమ్మాయి పంచుకున్నారు. కొత్త మోజు కొద్దీ కాగితాలు ముందేసుకుని కూర్చున్నారు.

పాకెట్ విప్పి ఆ పరికరాన్ని బయటకు తీసింది శ్రీమతి. రంగు బాగుందని మెచ్చుకుంది. రోజూ దోమల్తో పడుతున్న అవస్థ గురించి అరగంట సేపు అనర్గళంగా చెప్పేసి, వంటపనికి ఉపక్రమించింది.

ఇంక చేసేదేంలేక దినపత్రిక పట్టుకుని మళ్ళీ వరండాలోకి నడిచేన్నేను.

* * * *

"ఎక్స్క్యూజ్‌మీ సార్"

తలెత్తి చూశాను. రెండు చేతుల్లోనూ రెండు బ్యాగ్‌లు పట్టుకుని నిలబడ్డాడు. అతన్ని చూడగానే మళ్ళీ ఇందాకటి వ్యక్తి లాగానే, మరో కంపెనీనుంచి మరో ప్రతినిధి అనుకున్నాను.

లోపలికి రమ్మన్నట్లు తలాడించాను.

తెరవగానే కదిలే బొద్దింకలు, గోడలమీద చకచకపాకే బల్లులు స్ఫురణకు వచ్చాయి.

"ముఖ్యంగా పుస్తకాల షెల్ఫ్‌లో, వంటగదిలో వాడేందుకు చాలా బాగా ఉపయోగపడుతుంది సార్. చెదపురుగులుక్కూడా ఉపయోగించుకోవచ్చు" చెప్తున్నాడతను.

"ఏమండీ" శ్రీమతి పిలుపుకు లోపలికి వెళ్ళాను.

"ఎవరతను... ఏంటంట" ఆసక్తిగా అడిగింది. చెప్పేను.

"నిజమే. దీన్నిగురించి మొన్న సరస్వతి వదిన గారు కూడా చెప్పేరు. చాలా బాగా పనిచేస్తున్నదట. మీ పుస్తకాల షెల్ఫ్‌లో కూడా బొద్దింకలున్నాయంటున్నారుగా. పోనీ కొనేయండి. ఎంత చెప్తున్నాడేంటి?" అని అంది మా శ్రీమతి.

"ఇంకా రేటు విషయం అడగలేదు" అని చెప్పి వరండాలోకి చేరేను.

"చాలా మంచి పేరొచ్చింది సార్ మా ప్రొడక్ట్‌కి. ఎక్కువమంది ప్రిఫర్ చేస్తున్నారిప్పుడు. మా దగ్గర వస్తూనే... అయాం ష్యూర్... అంటూ తన గురించి, తన ప్రొడక్ట్ గురించి ఇంగ్లీషులో చాలా చక్కగా, వినయంగా చెప్పేడు.

ఇంతకీ అతను తెచ్చిన వస్తువేంటంటే బొద్దింకలు, బల్లులు, చీమలు వగైరాలను చంపేచాక్ పీస్ లాంటి పదార్థం. దాన్తో ఓ గీత గీస్తే బొద్దింకలు వగైరాలన్నీ వెంటనే చనిపోతాయట. చాలా పవర్‌ఫుల్‌ట. పిల్లలకు అందుబాటులో వుంచకూడదట.

అతను మాట్లాడుతుండగానే నా పుస్తకాలుంచిన అల్మేరా కళ్లల్లో కదలాడింది. తలుపులు తెరిచి వెళ్ళి నా బీరువాలో దాచాను. తాళం వేసి జేబులో డబ్బు తెచ్చి అతనికిచ్చాను.

"థ్యాంక్స్" చెప్పి వెళ్ళిపోయాడతడు.

"ఏమిటో నా చిన్నతనంలో పొలాలకు వేసే ఎండ్రిన్ అనేది ఒకటే తెలుసు. అటుతర్వాత చీమల మందొకటి ఎక్కువగా వాడుకలో వుండేది. ఇప్పుడో ఈగల మందొకటి, దోమల మందొకటి, నల్లులకి, బల్లులకి, బొద్దింకలకీ ఒక్కోదానికి ఒక్కో క్రిమి సంహారిణి" అంటూ మళ్ళీ పేపర్ చదవనారంభించాను.

కొత్త కలాలు సరిగా వ్రాయటం లేదంటూ పిల్లలిద్దరూ ఫిర్యాదు చేశారు. రిపేరు ప్రారంభించారు. వాళ్ళని పట్టించుకోకుండా పేపర్ చదవటంలో మునిగిపోయాను. కాసేపటికి శ్రీమతి భోజనానికి రమ్మని పిలిచింది.

హాల్లోనే అందరికీ కంచాలు పెట్టింది.

మేమిద్దరం మాకు ముగ్గురు. అయిదుగురం కంచాల ముందు ఆసీనులమైనాం. పదార్థాలు వడ్డించసాగింది శ్రీమతి.

"ఈగలు ఎక్కువైనాయి డాడీ" విసుగ్గా అన్నది పెద్దమ్మాయి.

"అవును డాడీ... అప్పుడెప్పుడో మనం హోటల్‌కి వెళ్ళినప్పుడు ఈగలు చంపే మిషన్ చూపించారే. మనం అది కొనుక్కోవచ్చుగా" అడిగింది చిన్నమ్మాయి.

అవన్నీ పెద్ద పెద్ద హోటల్స్‌లోనూ, స్వీట్‌షాపుల్లోనూ వాడతారు కానీ ఇళ్ళల్లోకి కాదనీ, దాని ఖరీదు చాలా ఎక్కువనీ చెప్పేను దానికి అర్థమయ్యేలా.

అనుపాకాలన్నీ అనువుగా వుండటం వల్ల కాస్తంత ఎక్కువగా తిన్నాను. తిన్న వెంటనే రూం లోకి వెళ్ళి నడుం వాల్చాను. పడుకున్న పదినిమిషాల్లోపే నిద్ర పట్టేసింది.

* * * *

దాదాపు పాతిక సంవత్సరాలు గడిచిపోయి వుంటాయి. నెరసిన జుట్టు, ఆనని చూపుతో హాల్లో మంచం మీద పడుకుని వున్నాన్నేను.

మా కొడుకు, కోడలు వరండాలో కూర్చుని ఏదో బేరం చేస్తున్నారు.

"ఆపరేషన్ చాలా సులభం సార్... వెరీ సింపుల్. జస్ట్ మనం తల దువ్వుకున్నట్లుగా మూడుసార్లు దువ్వితే చాలు. వాళ్ళకీ ఏమాత్రం నెప్పిగానీ, బాధ గానీ వుండదు. కరెంట్ కూడా చాలా తక్కువే ఖర్చవుతుంది. ఒక్క నిమిషం కూడా పట్టదుసార్" ఓ అపరిచిత కంఠం విన్పించింది నాకు.

"రిజల్ట్ వెంటనే వస్తుందా... టైమ్ పడుతుందా" ఆసక్తిగా అడిగాడు మా అబ్బాయి.

"అంత ఖరీదు పెట్టి కొంటున్నాం. మళ్ళీ పని చేయకపోతే వేస్ట్" అనుమానం వ్యక్తపరిచింది కోడలు.

"అలాంటిదేం వుండదు మేడం. కావాలంటే నేను ఆపరేట్ చేసి చూపిస్తాను. ఎవరైనా వున్నారా మరి" అడిగాడతను.

"ఆఁ... ఉన్నారు కానీ ఇప్పుడు కాదులే. మూడు సార్లు అలా దువ్వగానే మనిషి చనిపోవటం ఖాయమేనా" ఆత్రంగా అడిగిందామె.

"నో డౌట్ మేడం... తీస్కోండి సార్" బ్రతిమలాడేడు.

ఓ అయిదు నిమిషాలకు కొడుకు, కోడలు హాల్లోకి వచ్చారు. నేను నిద్ర పోతున్నాననుకొని ఆ దువ్వెన లాంటి వస్తువుని నా తలలో పెట్టబోయాడు మా కన్నకొడుకు. ఒక్కసారి ఆవేశంగా నా చెయ్యి వెళ్ళి వాడి చెంప తాకింది.

'అమ్మో' అన్న శ్రీమతి గావుకేకతో మెలకువ వచ్చి చుట్టూ చూశాను. కల మననం చేసుకుని గాభరా పడ్డాను కాస్సేపు.

"ఏంటండీ ఈ కొట్టటం... మొన్నకూడా ఇంతే... అబ్బా.... చచ్చేట్టు కొట్టారు... అసలోసారి డాక్టర్ దగ్గరికి వెళ్దాం పదండి" అని చిరుకోపం ప్రదర్శిస్తూ చెంప చేత్తో సవరించుకోసాగింది శ్రీమతి.

"డాక్టరూ వద్దు, వైద్యమూ వద్దు కాని ముందు నాకు వచ్చిన కల విను" అంటూ స్వప్న వృత్తాంతం అంతా వివరంగా చెప్పేను.

ఆమె చెంపమీద చేయినుంచి చూపుడువేలు ముక్కుపైకి చేరింది.

మంచం మీద కూర్చున్న నాకు ఎదురుగా కన్పిస్తున్న అద్దంలో చెరిగిన నా క్రాపు కనిపించింది.

మా మూడేళ్ళ కాళీ చరణ్‌ని పిలిచి దువ్వెనతో తల దువ్వమన్నాను. అద్దం ముందున్న దువ్వెన తెచ్చి నా తల దువ్వసాగాడు వాడు. ఆ దువ్వెన నన్ను వెక్కిరిస్తున్నట్టుగా నవ్వసాగిందన్న నా ఊహ నాకూ నవ్వు తెప్పించింది.

* * * *

◆ స్వాతి ◆